క్లుప్తంగా

రేపు సమీక్ష సమావేశం

కూనవరం: మండల స్థాయి వరదల కట్టడికి సమీక్షా సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు స్థానిక రెవెన్యూ కార్యాలయం నందు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఆర్వీ మురళీకృష్ణ ఆదివారం తెలిపారు. చింతూరు డివిజన్ సబ్‌కలెక్టర్ ఐటీడీఏ పీవో కావూరి చైతన్య ఆదేశాల మేరకు నిర్వహించనున్న ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌వోలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రేషన్‌షాప్ డీలర్లు, బోటు లాంచీ/బోటు యజమానులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

వాహనచోదకులు హెల్మెట్ ధరించాలి

కొయ్యూరు: ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని సీఐ వెంకటరమణ సూచించారు. ఆయన ఆదివారం సాయంత్రం కినపర్తి పంచాయతీ భీమవరం చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. పలువురు రికార్డులను పరిశీలించారు. రికార్డులు లేని వారిని హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు జరిగితే ప్రాణాలు నిలుపుకునేందుకు అవకాశం ఉందన్నారు. హెల్మెట్ ధరించకపోతే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.అదే విధంగా ర్యాష్ డ్రైవింగ్ చేసినా చర్యలు తప్పవన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ఇళ్లపై కూలిన మామిడి చెట్టు

అరకులోయ రూరల్: మండలంలోని శిర్గం పంచాయతీ ఎస్.తోకవలస గ్రామానికి చెందిన కిల్లో రాము, లొక్కోయి జగబంధుకు చెందిన గృహాలపై శనివారం భారీ ఈదురుగాలులకు ఓ మామిడిచెట్టు కూలింది. ఇంటి పైకప్పు దెబ్బతింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దీంతో ఆ కుటుంబీకులు ఊపిరిపీల్చుకున్నారు. ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత కుటుంబీకులు కోరుతున్నారు.

ఆలయ ప్రారంభం



మొండికోటలో భక్తులతో కలిసి పూజలు చేస్తున్న జనసేన నాయకుడు గంగులయ్య

జి.మాడుగుల: మండలంలో సింగర్భ పంచాయతీ మొండికోట గ్రామంలోని భగవాన్ చిద్గాగనందమహర్షుల వారు స్వామి ఆలయాన్ని భక్తిశ్రద్ధలతో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిద్గాగనంద మహర్షుల స్వామి వారికి భక్తులతో కలిసి జనసేన పార్టీ పాడేరు అసెంబ్లీ, అరకు పార్లమెంట్ ఇన్‌ఛార్జి డాక్టర్ వంపూరి గంగులయ్య భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఆయనను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. జనసేన నాయకులు భీమన్న, నగేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు రామకృష్ణ, చిట్టిబాబు, చినబాబు ఆచారీ తదితరులు పాల్గొన్నారు.

అనాథకు అంత్యక్రియలు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న స్థానికులు

రంపచోడవరం: రంపచోడవరంలో గ్రామంలో గత కొన్నేళ్లుగా భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న సత్తిబాబు ఆదివారం ఉదయం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మృతి చెందాడు. ఆ వ్యక్తికి సంబంధించి ఎవరు లేని కారణంతో మృతదేహాన్ని పోలీస్, మెడికల్ సిబ్బంది సహకారంతో స్థానిక సర్పంచ్ మంగా బొజ్జయ్య ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది అంత్యక్రియలు నిర్వహించారు. ఈ మేరకు గౌస్ తన వంతు సహాయాన్ని అందించారు. అలాగే స్థానికులు నాగబాబు, మున్నా, పీరు సాహెబ్, సాయిబాబా ఆలయ పూజారి అద్దంకి వెంకటేశ్వరరావు, టీ స్టాల్ భద్రం తదితరులు సహకారం అందించారు.

కూరగాయల సాగు..లాభాలు బాగు



దోడిపుట్టులో కూరగాయలు సాగు చేస్తున్న గిరిజన రైతులు



ముంచంగిపుట్టు వారపు సంతలో అమ్మకాలు చేస్తున్న దోడిపుట్టు గిరిజన మహిళ

- దోడిపుట్టులో 30 ఏళ్లకు పైగా ఆకుకూరలు సాగే ప్రధాన వృత్తి
- విత్తు నుంచి విక్రయం వరకు స్థానికుల శ్రమే
- సరిహద్దు గ్రామాలకు,ఆశ్రమ పాఠశాలలకు నిత్యం కూరగాయల సరఫరా

ముంచంగిపుట్టు: ఒకటి,రెండు కాదు గత 30 ఏళ్లపైగా కూరగాయల వృత్తినే నమ్ముకొని ఆ గ్రామం జీవనం సాగిస్తోంది. ఏడాది పొడువునా వివిధ రకాల కూరగాయలను సాగుచేస్తూ ప్రత్యేకతను చాటుకుంటోంది. విత్తు నుంచి విక్రయం వరకు కుటుంబంలోని ప్రతి ఒక్కరూ సాగులో భాగస్వామ్యమవుతూ జీవనోపాధి పొందుతున్నారు.ఆ గ్రామమే ముంచంగిపుట్టు మండలం దోడిపుట్టు కూరగాయల సాగుకు ఆయువుపట్టుగా నిలుస్తుంది. గ్రామంలో 30 ఏళ్ల కిందట కేవలం 40 కుటుంబాలతో కూరగాయల ప్రస్థానం మొదలైంది. ఇప్పుడు 186 కుటుంబాలు కూరగాయల సాగు చేయడం విశేషం.

400 ఎకరాల్లో పండించే పంటలు

దోడిపుట్టు గ్రామంలో 368 మంది గిరిజన రైతులు 400 ఎకరాల్లో పలు రకాల పంటలను సాగు చేస్తున్నారు. క్యాబేజీను 50 ఎకరాల్లో ,క్యారెట్‌ను-40 ఎకరాలు, టమాట-55 ఎకరాలు, పచ్చిమిర్చి-20 ఎకరాలు, బంగాళదుంపలు-70 ఎకరాలు, చిక్కుడు-40 ఎకరాలు, బీర-35 ఎకరాలు, వంకాయ-46 ఎకరాలు, క్యాలీఫవర్- 20 ఎకరాల్లో, తియ్యదుంపలు-30 ఎకరాలు, బెండ -18 ఎకరాల్లో పాటు ఆకు కూరలను 61 ఎకరాల్లో పండిస్తున్నారు. ప్రతిరోజు 280 కిలోలకుపైగా అన్ని కూరగాయల దిగుబడి వస్తుంది. పండించిన కూరగాయలను ముంచంగిపుట్టు, పెదబయలు, అరకు, డుంబ్రిగూడ, హుకుంపేట మండలాల్లో జరిగే వారపు సంతలతో పాటు ఒడిశా రాష్ట్రంలోని మాచ్‌ఖండ్, ఒనకఢిల్లీ, పాడువా గ్రామాల్లో జరిగే సంతలకు తీసుకువెళ్లి విక్రయిస్తున్నారు. దీనికి తోడు సుమారు 58 ఆశ్రమ పాఠశాలలకు సైతం దోడిపుట్టు నుంచి అవసరమైన కూరగాయలను సరఫరా చేస్తున్నారు. ఐటీడీఏ నుంచి గతంలో సబ్సిడీతో విత్తనాలు సరఫరా చేసేవారు. ప్రస్తుతం ఎటువంటి సబ్సిడీ విత్తనాలు అందించడం లేదని, ఐటీడీఏ అధికారులు సబ్సిడీపై విత్తనాలు అందించాలని దోడిపుట్టు గ్రామ గిరిజనులు కోరుతున్నారు.

ఏడాదంతా సాగు



మా పూర్వీకుల నుంచి కూరగాయల సాగు చేస్తూ అమ్మకాలు చేస్తున్నాం. మాకున్న పొలంలో ఏడాదంతా పండిస్తాం. నాలుగైదు రకాల కూరగాయలు, ఒకటి, రెండు రకాల ఆకు కూరలను సాగుచేస్తాం. ఒక పంట కోతకు వస్తే మరో పంట వేసుకుంటాం. ఇలా చేయడం వల్ల రోజు వ్యాపారానికి పంట అందుబాటులో ఉంటుంది. ఆదాయం కూడా లభిస్తుంది. ఇక్కడ పండించే కూరగాయలు రుచిగా ఉంటాయి.

– మోహనరావు, రైతు, దోడిపుట్టు గ్రామం

ఆశాజనకంగా లాభాలు



దోడిపుట్టు గ్రామంలో 186 కుటుంబాలు ఏడాది పొడువునా కూరగాయల సాగునే నమ్ముకొని పంటలను పండిస్తారు. సుమారు 400 ఎకరాల్లో ఈ ఏడాది కూరగాయల సాగు చేస్తున్నారు.రైతులకు అవసరమైన విత్తనాలను ఇప్పటికే అందించడం జరిగింది. వివిధ రకాల పంటలను పండిస్తూ వారపు సంతలకు తీసుకువెళ్లి అమ్మకాలు చేస్తూ లాభాలను ఆర్జిస్తున్నారు.

– శ్రీనివాసబాబు, ఏవో, ముంచంగిపుట్టు

ఆత్మీయ వీడ్కోలు



ఉద్యోగ విరమణ పొందిన మేనేజర్ మోహన్ దంపతులను సన్మానిస్తున్న జీసీసీ ఉద్యోగులు



ఎం.నిట్టాపుట్టులో ఉపాధ్యాయుడు భగవాన్‌రాజును సన్మానిస్తున్న సహచరులు తదితరులు

ముంచంగిపుట్టు: స్థానిక గిరిజన సహకార సంస్థలో మేనేజర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన చెట్టి మోహన్‌ను సహచర ఉద్యోగులు తదితరులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చెట్టి మోహన్, సుబ్బలక్ష్మి దంపతులను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి హాజరైన జీసీసీ డీఎం డి.సింహాచలం మాట్లాడుతూ నిస్వార్థ సేవలతోనే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. చెట్టి మోహన్ అందించిన సేవలను ఆయన కొనియడారు. గత 38 సంవత్సరాలకుపైగా గిరిజన సహకార సంస్థలో అకింతభావంతో పనిచేసి, అందరి మన్ననలు పొందిన మేనేజర్ మోహన్ ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబంతో సంతోషంగా గడపాలన్నారు. జిసిసికి ఆయన అందించిన సేవలు మరువలేనివని, ప్రతి ఒక్క ఉద్యోగి ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని డీఎం సింహాచలం అన్నారు. వైస్ ఎంపీపీ సత్యనారాయణ, సర్పంచులు సుభాష్, త్రినాథ్, బాబూరావు, పాండురంగ స్వామి, కుటుంబ సభ్యులు, జిసిసి ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలో పెదలోచలి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలురు ఆశ్రమోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన మత్స్యరాస బంగార్రాజు, ఎం.నిట్టాపుట్టు గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ ఆదివారం జి.మాడుగులలో పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడు మత్స్యరాస భగవాన్‌రాజులను



పెదలోచలిలో ఉపాధ్యాయుడు బంగార్రాజును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు, గ్రామస్తులు

పలువురు ఉద్యోగులు, గ్రామ పెద్దలు పూలమాలలు వేసి, శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాట్లాడుతూ మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ మత్స్యరాస వెంకట గంగరాజు, సమర సత సేవా ఫౌండేషన్ కన్వీనర్ ఎం.మత్స్యరాజు మాట్లాడుతూ నిస్వార్థంతో, గిరిజన విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన ఇద్దరు ఉపాధ్యాయులు సేవలను అందరు ఆదర్శవంతగా తీసుకోవాలని అన్నారు, కార్యక్రమంలో ఎంఎల్ఎస్ పాయింట్ గోడౌన్ సూపరింటెండెంట్ మత్స్యరాస సింహాచలంరాజు, టీడీపీ నాయకుడు రామరాజు, ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, విశ్వేశ్వరరాజు, కుమారి, పద్మ, ఈశ్వరమ్మ, జీటీ డబ్ల్యూఎస్ ఏహెచ్ పాఠశాల జూనియర్ అసిస్టెంట్ సింహాచలం, ఫారెస్టు బీటీ ఆఫీసర్ మాతే సింహాచలం, ఏఎస్ఎం సుమిత్ర, అంగన్‌వాడీ సంఘం నాయకులు సింహాచలం, చంద్రమణి పాల్గొన్నారు.

బైక్‌ల చోరీపై పోలీసులకు ఫిర్యాదు

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ సుజనపేట గ్రామానికి చెందిన వెంగడ చంద్రశేఖర్ పల్సర్ బైకు చోరీకి గురి కావడంతో ఆదివారం ముంచంగిపుట్టు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడు చంద్రశేఖర్ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.ముంచంగిపుట్టు మండల కేంద్రంలోని ఎంపీడీవో నివాస గృహాల సమీపంలో ఇంట్లో నివాసముంటున్నానని, శనివారం రాత్రి ఇంటి వద్ద పార్కింగ్ చేసిన బైకు ఆదివారం ఉదయం నుంచి కనిపించ లేదని, మండల కేంద్రం అంతా వెతికినా ఆచూకీ లభ్యం కాలేదన్నారు.దీంతో బైకు చోరీకి గురైనట్టు భావించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. పల్సర్150 బైకు (ఏపి31డిజి 9748) గల బైకు ఎక్కడ కనిపించినా, 8985884437 ఫోన్ నంబర్‌కు తెలియజేయమని బాధితుడు చంద్రశేఖర్ కోరారు.



చోరీకి గురైన బైక్ ఇదే

కొయ్యూరు: తోట దొరబాబుకు చెందిన ద్విచక్ర వాహనం శనివారం రాత్రి చోరీకి గురైంది. ఇంటి వద్ద ఉన్న బైక్‌ను దొంగలు పట్టుకుపోయారని బాధితుడు ఆదివారం కొయ్యూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొంత కాలంగా బైక్ దొంగతనాలు జరగకుండా పోలీసులు గట్టిగా చర్యలు తీసుకున్నారు. మళ్లీ బైక్ దొంగతనాలు ప్రారంభం కావడంతో ద్విచక్ర వాహనచోదకులు భయపడుతున్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



శ్యామ్‌సుందర్ (ఫైల్)

ముంచంగిపుట్టు: మండలంలోని మాకవరం పంచాయతీ లబడపుట్టు గ్రామంలో జీపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గల్లెల శ్యామ్‌సుందర్(35) ఆదివారం మధ్యాహ్నం గుండెపోటుకు గురై మృతి చెందారు.ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ముంచంగిపుట్టు మండల కేంద్రంలో నివాసం ఉంటున్న ఉపాధ్యాయుడు శ్యాంసుందర్ ఇంట్లో గ్యాస్ బండ సరిచేస్తుండగా ఆకస్మికంగా గుండె నొప్పి రావడంతో భార్య సృజన కుమారి స్థానికుల సహాయంతో ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. వైద్యాధికారి సంతోష్ వైద్య సేవలు అందించేలోగా గుండె నొప్పి ఎక్కువై మృతి చెందారు. మృత్యుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఉపాధ్యాయుడు శ్యాంసుందర్ సొంత గ్రామమైన కరిముఖిపుట్టు పంచాయతీ తాంగులకు మృతదేహాన్ని తరలించారు. సోమవారం అత్యక్రియలు నిర్వహిస్తున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.ఉపాధ్యాయుడు శ్యాంసుందర్ మృతికి ఎంఈవో కృష్ణమూర్తి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

నక్కపల్లి : చినదొడ్డిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఆదివారం సూర్యనమస్కారాలు చేయించారు. వేంపాడు ఆయుష్ ఆస్పత్రికిచెందిన యోగా ట్రైనర్ డీ రాంబాబు మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. రోజూ యోగా చేయాలని సూచించారు.

అధ్వాన దారులతో అవస్థలు

- మూడు నెలలకే బీటలు వారిన తారురోడ్డు
- పలుచోట్ల కల్వర్టుల వద్ద కుంగిన రోడ్డు
- జామిగుడ నుంచి ఒడిశా బోర్డర్ వరకు రూ.12 కోట్లతో రహదారి



బీటలు వారిన జామిగుడ ఒడిశా బోర్డర్ రోడ్డు



కెందుగుడ సమీపంలో కుంగిన తారురోడ్డు

పెదబయలు: దశాబ్దాల కాలం తరువాత తారు రోడ్డు నిర్మాణం జరిగిందని సంతోషంగా ఉండగానే ఇటీవల కురిసిన తేలిక పాటి వర్షాలకే తారు రోడ్డు పలుచోట్ల బీటలు వారి,కల్వర్టుల వద్ద కుంగిపోయింది. అల్లూరి జిల్లా పెదబయలు మండలం జామిగుడ గ్రామం నుంచి ఒడిశా బోర్డర్ వరకు ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం(పీఎంజీఎస్‌వై) ద్వారా 6 కిలోమీటర్ల దూరం రూ.12 కోట్లతో తారురోడ్డు మూడు నెలల క్రితం నిర్మాణం పూర్తి చేశారు. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆరు కిలోమీటర్ల దూరంలో పలు చోట్ల తారురోడ్డు బీటలు వారింది. అలాగే కల్వర్టులు నిర్మించిన పలు ప్రదేశాల్లో రోడ్డు కుంగిపోయింది. దశాబ్దాల కాలం తరువాత మంజూరు అయిన రోడ్డు పంచాయతీ రాజ్ విభాగం ఇంజినీర్ల పర్యవేక్షణలో రోడ్డు నిర్మాణం జరిగింది. సంబంధిత ఇంజినీర్ల పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడం వల్లే మూడు నెలలకు రోడ్డు బీటలు వారినట్టు జామిగుడ పంచాయతీ జామిగుడ, కెందుగుడ, కొజ్జరిగుడ, మెట్టగుడ సరిహద్దు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ స్పందించి నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్మాణం చేసిన కాంట్రాక్ట్, ఇంజీనీర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వారం రోజుల్లో నిర్మిస్తాం

మండలంలోని జామిగుడ నుంచి ఒడిశా బోర్డర్ వరకు తారురోడ్డు నిర్మాణం పూర్తి చేయడం జరుగుతుందని.ఇంకా పని ప్రగతిలోనే ఉందని.లూజ్ మట్టి కావడం, చాలా చోట్ల సపోర్టింగ్ వాల్స్ కట్టాల్సి ఉందని, వర్షాలకు మట్టి జారి రోడ్డు బీటలు వారిందని,కల్వర్టు వద్ద సపోర్టింగ్ వాల్ నిర్మాణం జరగాల్సి ఉందని,అయితే ఎన్నికల కోడ్ వల్ల పనులు జాప్యం జరిగిందని, ఇంకా రోడ్డు పనులు పూర్తి కాలేదని వారం రోజుల్లో మట్టి లూజ్ వల్ల బీటలు వారిన ప్రదేశాల్లో మరమ్మతులు చేయిస్తామని. ఇంకా కాంట్రాక్ట్‌కు బిల్లులు కూడ చెల్లించలేదని, పూర్తి స్థాయిలో పనిచేయిస్తాం. ఇబ్బంది పడాల్సిన పని లేదన్నారు. వాహనాలు రాకపోకలకు ఇబ్బంది లేకుండా సైడ్ రోడ్డు నిర్మాణం జరుగుతుంది.

– రవికుమార్, డీఈ, పంచాయతీ రాజ్ ప్రాజెక్టు, పెదబయలు

ఘనంగా మోదకొండమ్మ పండగ



అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

మాడుగుల: సత్యవరంలో గ్రామ ఆరాధ్య దేవత మోదకొండమ్మ పండగ ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారు నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నేల వేషాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామానికి చెందిన మహిళలు అమ్మవారి ప్రతి రూపమైన ఘటాలతో కాలి నడకన ఆలయానికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

వరి ఆకుపోతలు ప్రారంభం



లూలూరు పొలాల్లో వరి విత్తనాలు జల్లుతున్న రైతులు



ట్రాక్టరుతో ఆకుమడి దున్నుతున్న రైతు

- నారుమడులు సిద్ధం చేసుకుంటున్న రైతులు

బుచ్చెయ్యపేట: ఖరీఫ్ వరి ఆకుపోతలు ప్రారంభమయ్యాయి. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ఆదివారం వరి ఆకు పోతలు వేశారు. పది రోజులుగా వర్షాలు నమ్మగా కురుస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులైంది. ఎండలు, ఉక్కపోత తగ్గి వాతావరణం చల్లబడింది. పలు గ్రామాల్లో నదులు పొంగి ప్రవహిస్తుండగా, వ్యవసాయ బావులు, చెరువులు నీటితో నిండుతున్నాయి. దీంతో రైతులు వరి ఆకుపోతలు వేయడం ప్రారంభించారు. లోపూడి, లూలూరు, బంగారు మెట్ట, ఎల్బీపురం, పొట్టిదొరపాలెం, కొమళ్లపూడి, గంటి కొర్లాం తదితర గ్రామాల్లో రైతులు జోరుగా వరి ఆకుపోతలు వేశారు. బుచ్చెయ్యపేట మండలంలో ఏటా 6,800 ఎకరాల్లో వరినాట్లు వేస్తారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో అన్ని గ్రామాల్లో రైతులు వరినాట్లు వేయడానికి సిద్ధమయ్యారు. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల ద్వారా తీసుకున్న స్వర్ణ, సాంబమసూరి, సోనామసూరి, ఆర్జీఎల్, శ్రీకాకుళం సన్నాలు తదితర రకాల వరి విత్తనాలను రైతులు జోరుగా వేస్తున్నారు. సేంద్రియ ఎరువులు భూమిలో కలిపి వరి విత్తనాలు జల్లి దుక్కటిద్దులు, ట్రాక్టర్లతో ఆకుమడులు దున్ని వరి విత్తనాలు భూమిలో కలుపుతున్నారు. సొంత వరి విత్తనాలు జల్లేటప్పుడు విత్తన శుద్ధి చేసుకుని చల్లుకోవాలని మండల వ్యవసాయాధికారి భాస్కరరావు సూచించారు. ఈ మేరకు నారుమడి యాజమాన్య పద్ధతులను సూచించారు.

నారుమడి తయారీలో జాగ్రత్తలు...

వరినారు పోసు రైతులు కొన్ని జాగ్రత్తలు పాటించి నారుమళ్లను పోసుకుంటే నాణ్యమైన నారు పొందవచ్చు. దమ్ము చేసిన నేలను 10 మీటర్ల పొడవు, ఒక మీటరు వెడల్పుతో నారుమడి చేసుకోవాలి. నారుమడిలోని నీరు, పోషకాలు బయటకు పోకుండా గట్లు వేసుకోవాలి. గట్లు సమానంగా గట్టిగాను పోయాలి. మడిలో చెత్తా చెదారం లేకుండా జాగ్రత్త పడాలి. నారుమడి బురద పదును ఉండాలి. నారుమడులు ఎత్తుగా ఉండేలా జాగ్రత్త పడాలి. రెండు మడుల మధ్యలో 20 సెంటీమీటర్ల వెడల్పులో కాలువ తీయాలి. కాలువలోని మట్టిని తీసి మడిలో వేసే నారుమడిని ఎత్తుగా చేసుకోవాలి. నారుమడి మొత్తం చదునుగా ఉండాలి. నారుమడి 10 నుంచి 12 రోజుల ముందే దమ్ము చేసి చదును చేసుకోవాలి. నీరు పెట్టడానికి తీయటానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేసుకోవాలి. మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు ఐదు కిలోల చొప్పున చల్లుకోవాలి. నారు పూర్తిగా పురి విచ్చుకునే వరకు ఆరు తడులు ఇచ్చి.. తర్వాత నీరు నిల్వ కట్టాలి. జింకు లోపాన్ని గమనించి 2 గ్రాముల జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఈ జింకు లోప లక్షణాలు ఎక్కువగా కనబడతాయి. తల్లి పురుగులు గుడ్లను కొసల మీద పెడుతుంది. నారు నాటేటప్పుడు కొసలు విరిచి నాటాలి. దీనితో గుడ్లను నిర్మూలించవచ్చు.

విస్తారంగా కర్ర పెండలం సాగు



దాలివలసలో కర్ర పెండలం పంట

కె.కోటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో కర్ర పెండలం పంటను రైతులు విస్తారంగా సాగు చేస్తున్నారు. ప్రధానంగా ఈ పంటను మెట్ట ప్రాంతాలైన గరుగుబిల్లి, గొండుపాలెం, దాలివలస, కొరువాడ, డి.అగ్రహారం తదితర గ్రామాల్లోని 150 ఎకరాల్లో వేశారు. మెట్ట భూములు ఈ పంటకు అనుకూలం కావడంతో దుంపలు దిగుబడి అధికంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. కురుస్తున్న వర్షాలు పంటకు మేలు చేయనున్నట్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల్లో కర్ర పెండలం పంట చేతికి అందివస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రక్తదానం చేయాలి

యలమంచిలి రూరల్ : అన్ని దానాల్లో కెల్లా రక్తదానం చాలా గొప్పదని యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని కొత్తపేటలో కాకినాడ శ్రీ అభయ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి స్థానిక వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులతో కలిసి హాజరయ్యారు. ఆయన రక్తదాతలతో మాట్లాడి, వారి సేవా భావాన్ని ప్రశంసించారు.